సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


మంగళవారం । 18 । మార్చి । 2025



గురుతర బాధ్యతగా..

ఉపాధ్యాయులంటే జీవితానికి మార్గదర్శనం చేసేవారే కాదు.. ఉన్నత విలువలు ఆచరణలో చూపేవారు కూడా. ఈ కోవలోకే వస్తారు. ఇవ్వల ప్రసాదరావు, దాడి కొండబాబు.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహర్ బుధవారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.48
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

న్యూస్‌రీల్

12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి



కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

అమలాపురం రూరల్: వెంటనే 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏపీపీఆర్‌జీఏ) ఆధ్వర్యాన పెన్షనర్లు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. 2023 జూలై 1వ తేదీ నుంచి పీఆర్‌సీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డీఏ, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. డీఆర్, పీఆర్‌సీ బకాయిలు పొందకుండానే పెన్షనర్లు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈహెచ్‌ఎస్ కార్డులపై వైద్యం చేయబోమని ఆసుపత్రుల్లో చెబుతున్నారని అన్నారు. తక్షణమే మెడికల్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం పంపించామన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీవీవీ సూర్యనారాయణరాజు, కార్యదర్శి ఎస్‌వీ నాయుడు, కోశాధికారి ఎం.ఆశీర్వాదం తదితరులు వినతిపత్రం సమర్పించారు.

అప్రమత్తంగా ఇంటర్ మూల్యాంకనం



మూల్యాంకన సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖరరావు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు ఆదేశించారు. మూల్యాంకనం నిర్వహిస్తున్న అధ్యాపకులు, జిల్లా పరీక్షల కమిటీ ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7 నుంచి కళాశాలలో సంస్కృతం, సోమవారం నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, పౌరశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం మొదలైందని చెప్పారు. మూల్యాంకనం నిర్వహిస్తున్న సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లు వాడరాదని స్పష్టం చేశారు. జవాబు పత్రాలను నిశితంగా పరిశీలిస్తూ దిద్దాలని సూచించారు. మార్కుల కేటాయింపులో అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.

బ్రిడ్జి కోర్సు పరీక్షకు 428 మంది గైర్హాజరు

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా జరిగాయని సోమశేఖరరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాల్లో మొత్తం 2,336 మంది విద్యార్థులకు గాను 1,908 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారన్నారు. 428 మంది పరీక్షలు రాయలేదని తెలిపారు.

సుబ్బాలమ్మ తల్లికి రూ.26 లక్షలతో వెండి మకర తోరణం



వెండి మకర తోరణాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారికి పలువురు భక్తులు రూ.26 లక్షల విలువైన 26 కిలోల వెండి మకర తోరణాన్ని సోమవారం సమర్పించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు ఈ మకర తోరణాన్ని ఉదయం అంతా ఆలయం వద్ద ప్రదర్శనగా ఉంచి, పూజలు చేశారు. సాయంత్రం రెండు అశ్వాల రథంపై దీనిని ఉంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గరగ నృత్యాలు, కేరళ డప్పుల వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి సుబ్బాలమ్మ తల్లి సన్నిధిలో మకర తోరణాన్ని ఉంచి పూజలు చేశారు. అమ్మవారి జన్మదినం, దేవస్థానం సప్తమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వెండి మకర తోరణాన్ని అమ్మవారి వద్ద అలంకరించారు.

కదిలిస్తే.. కన్నీటి వేదన

- పీజీఆర్‌ఎస్‌లో ప్రజల గోడు
- కూటమి నేతల దౌర్జన్యాలు, అక్రమాలపై ఫిర్యాదులు
- గోదావరిలో ఇసుక, మట్టి అక్రమ విక్రయాలు అడ్డుకోవాలని అర్జీలు



కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, అమలాపురం/అమలాపురం రూరల్/ఉప్పలగుప్తం: అనారోగ్యం బారిన పడి.. ఇంటి వద్దనే ఉండి.. మూడు నెలలు బయటకు రాలేకపోతే పింఛన్ తొలగించారని ఒక వృద్ధురాలు.. గోదావరి ఇసుక అక్రమ తవ్వకాల వల్ల తమ భూములు కోతకు గురవుతున్నాయని ఒక రైతు.. గోదావరి ఇసుక ఒక్కటే కాదు.. డ్రెయిన్‌లో మట్టి కూడా తవ్వేసి అమ్ముకుంటున్నారంటూ సమాజ హితం కోరే ఒక వ్యక్తి.. రెవెన్యూ సిబ్బంది తప్పుడు రికార్డు సృష్టించి తమ ఫలసాయం తినేస్తున్నారని ఒక బాధితుడు.. ఇలా అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ – పీజీఆర్‌ఎస్)కు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ కష్టాలను అధికారులకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమానికి 270 వరకూ అర్జీలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న దందాలపై సహితం పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎవరిని కదిపినా కన్నీటి వేదనే వినిపించారు. తమ సమస్యలు పరిష్కరించేవారే లేరంటూ నిట్టూర్చారు.

కూటమి నాయకులు మట్టి దోచుకుంటున్నారు



మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం నుంచి సఖినేటిపల్లి మండలం మోరిపోడు వరకూ విస్తరించి ఉన్న డ్రెయిన్ తవ్వకాలు రూ.47 లక్షలతో చేపట్టారు. ఆ తవ్వకాల్లో వచ్చిన మట్టిని అక్రమంగా అమ్మేసుకుంటున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికని చెప్పి ఆరు ట్రాక్టర్లు మాత్రమే అక్కడ వినియోగించి, 400 ట్రాక్టర్లకు పైగా అమ్మేసుకున్నారు. దీనిపై పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశా.

– ముత్యాల శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక, మలికిపురం మండలం

సమస్య పరిష్కారం కాలేదు



ఐ.పోలవరం మండలం గోగుల్లంకలో సర్వే నంబర్ 608 నుంచి 612 వరకూ సీఆర్‌జెడ్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువుల తవ్వకాలు చేపట్టారు. అక్రమ **ఆక్వా చెరువుల కాలుష్యం** వల్ల పంట చేలు, **కొబ్బరి తోటలకు** ముప్పు ఏర్పడుతోంది. **దీనిపై రెండు నెలల** క్రితం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు **చేశాను. అయినా** సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ ఫిర్యాదు చేశా.

– నడింపల్లి భరత్, రైతు, గోగుల్లంక, ఐ.పోలవరం మండలం

ముంపు సమస్య పరిష్కరించాలి



పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద లంక తోట శివారు 96 ఎకరాల్లో వరి సాగు చేసుకుంటున్నాం. ప్రతి సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాలు, వరదలకు డ్రైనేజీలో ముంపు వల్ల చేలు దెబ్బ తింటున్నాయి. జమీందారు ఇంటి సమీపాన డ్రెయిన్ వద్ద ఉన్న లాకు షట్టర్లు పాడైపోయాయి. ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞాపన చేసుకున్నాను.

– దేగల వెంకట రమణ పేరూరు లంకతోట, అమలాపురం మండలం

అమ్మ పింఛన్ తొలగించారు



మా అమ్మ అక్షింతల సుబ్బరామలక్ష్మి కొత్తపేట మండలం పలివెలలో ఉంటారు. ఆమెకు వితంతు పింఛన్ వస్తోంది. అమ్మకు ఇటీవల తలకు, వెన్నెముక ఆపరేషన్ చేయించాం. ఆ సమయంలో మా ఇంటి వద్దనే ఉండి విశ్రాంతి తీసుకోవడంతో మూడు నెలల పాటు ఫించన్ తీసుకోలేదు. దీనిని సాకుగా చూపించి పింఛన్ తొలగించారు. దీనిని పునరుద్ధరించాలని పీజీఆర్‌ఎస్‌లో అర్జీ ఇచ్చాం.

– కె.లలిత, రామలక్ష్మి, పలివెల, కొత్తపేట మండలం

30 సార్లు ఫిర్యాదు చేసినా..



ప్రభుత్వం మా కుటుంబానికి 2.50 ఎకరాల్లో ఇచ్చిన పట్టా భూమిని అప్పగించాలని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో 30 సార్లు ఫిర్యాదు చేశాను. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. 1973 నుంచి 2017 వరకూ భూమి మా అధీనంలో ఉంది. పంట బోదె అని అధికారులు తప్పుడు రికార్డులు సృష్టించారు. తహసీల్దార్, వీఆర్‌ఓలు భూమిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అధికారులు వేలాది రూపాయల ఫలసాయాన్ని అనుభవిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని అర్జీ సమర్పించాను.

– కుంచే రాజేంద్ర ప్రసాద్, కుంచే వెంకన్నబాబు, జి.వేమవరం, ఐ.పోలవరం మండలం

కూటమి పార్టీ వారు చంపుతామని బెదిరిస్తున్నారు



అల్లవరం మండలం గోడిలంక గ్రామం రాజుగారి వీధిలో పంచాయతీ సిమెంటు రోడ్డును మూడు నెలలు క్రితం సర్పంచ్‌తో పాటు పలువురు కూటమి నాయకులు ధ్వంసం చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. దీంతో నన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. రోడ్డు తవ్విన వారితో పాటు కొంత మంది అర్ధరాత్రి సమయాల్లో నా ఇంటికి వచ్చి, తలుపులు కొట్టి, ఫిర్యాదులు ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపుతామని బెదిరిస్తున్నారు. నాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాను.

– రుద్రరాజు వెంకటరాజు (తాతాలు రాజు), రైతు, గోడిలంక, అల్లవరం మండలం

ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



కపిలేశ్వరపురం, ఆలమూరు, కొత్తపేట మండలాల పరిధిలోని కేదార్లంక, వాడపాలెం, తాతపూడి, కొత్తపేట ఇసుక ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. దీని వల్ల లంక భూములు కోతకు గురవుతున్నాయి. మైన్స్ అధికారులు వారి తాయిలాల కోసం ఇష్టానుసారం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీనిపై మైన్స్, భూగర్భ జల, రెవెన్యూ, జలవనరుల శాఖలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ వేసి, పరిస్థితులు బట్టి అనుమతులివ్వాలి. ఈ మేరకు వినతిపత్రం ఇచ్చాను.

– పెదపూడి బాపిరాజు, రైతు, వాడపాలెం, కొత్తపేట మండలం.

సారా నిర్మూలనకు నవోదయం 2.0

అమలాపురం రూరల్: సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమం అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ముద్రించిన నవోదయం 2.0 వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సారా తాగడం వలన ఎంతో మంది చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, దీనివల్ల కుటుంబాలు చిన్నాభిన్నమై సామాజికంగా, ఆర్థికంగా వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నవోదయం 2.0 కార్యక్రమాల ద్వారా సారా దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో ఎవరైనా సారా తయారీ, రవాణా, నిల్వ చేసినా, అమ్మినా చట్ట ప్రకారం ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల వరకూ జరిమానా విధిస్తారని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరైనా సారా విక్రయిస్తున్నట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీఎస్ ప్రసాద్ కోరారు. అనంతరం సారా రహిత సమాజం దిశగా ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా అటవీ అధికారి ఎంవీ ప్రసాద్ రావు, ఏఈఎస్ జి.అమరబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



అంతర్వేది స్వామితో ఆటలు వద్దు

మలికిపురం: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారితో ఆటలు వద్దని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి నాగిడి సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. అంతర్వేది ఆలయ సమస్యను, హిందువుల మనోభావాలను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు, నేడు సమస్యను నిర్వీర్యం చేస్తూ, ప్రజలకు న్యాయం చేయకుండా సాక్ష్యాలను మాయం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సీబీఐ విచారణను వేగవంతం చేసి, దోషులను శిక్షించేంత వరకూ పాత రథాన్ని అక్కడి నుంచి తీయరాదని డిమాండ్ చేశారు. కొపనాతి కృష్ణమ్మ వంశస్తులను ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్లుగా నియమించాలని, అంతర్వేది ఆలయాన్ని కేంద్ర పురావస్తు శాఖకు అప్పగించాలని కోరారు. లేకుంటే అగ్నికుల క్షత్రియ సంఘాలు, బీసీ సంఘాలు, హిందూ సంఘాలతో చర్చించి, రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు పిలుపునిచ్చి, అన్యాయాన్ని ఎదుర్కొంటామన్నారు.

10 కేజీల వెండి సమర్పణ

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయానికి దాత సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు సోమవారం 10 కిలోల వెండి సమర్పించారు. దీనితో మూల భావనారాయణ స్వామి వారికి మకర తోరణం తయారు చేయించాలని ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను కోరారు.

పోలేరమ్మ తల్లికి వెండి కిరీటం



పోలేరమ్మ అమ్మవారికి వెండి కిరీటం సమర్పిస్తున్న భక్తులు

ఆలమూరు: పెదపళ్ల గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి దాతలు రూ.2.7 లక్షలతో వెండి కిరీటం తయారు చేయించి, సోమవారం సమర్పించారు. ఈ కిరీటానికి తొలుత గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండున్నర కిలోల బరువైన ఈ వెండి కిరీటాన్ని అమ్మవారికి అర్చకులు అలంకరించారు. గ్రామానికి చెందిన జాస్తి సుబ్బన్న, లక్ష్మీ నరసమ్మ, సూరన్న, సత్యవతి, శ్రీరాములు, సూరమ్మ దంపతులు, వారి వారసులు కలిసి ఈ కిరీటాన్ని తయారు చేయించారు. కార్యక్రమంలో జాస్తి వెంకటేశ్వరరావు, జాస్తి భాస్కరరావు, దాసరి శారదాదేవి, జాస్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి

అమలాపురం రూరల్: క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డీఆర్‌ఓ బీఎల్‌ఎస్ రాజకుమారి పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి నివారణపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నిర్మూలనపై పూర్తి అవగాహన పెంచుకొని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దగ్గు, రెండు వారాల పాటు జ్వరం, బరువు తగ్గడం , నోటి నుంచి రక్తం కారడం వంటివి జరిగితే తక్షణం వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడటం ద్వారా క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ జిల్లా శాఖ ప్రతినిధి డాక్టర్ జేఎస్ శివకుమార్ మాట్లాడుతూ, క్షయ అంటువ్యాధి అని, గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని చెప్పారు. క్షయ లక్షణాలు గుర్తిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. డాక్టర్ పీఎస్ శర్మ కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు వైటీ నాయుడు, డాక్టర్ పి.సురేష్, లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు, టీబీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభం

- తొలి రోజు టెన్త్ పరీక్షలకు 18,942 మంది హాజరు
- పరీక్ష కేంద్రాల్లో అధికారుల తనిఖీలు



కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రాయవరం/ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా 110 కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి 8.30 గంటలకే విద్యార్థులు తమతమ పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నోటీసు బోర్డులో ప్రదర్శించిన హాల్ టికెట్ నంబర్లు చూసుకుని తమకు కేటాయించిన రూముల్లోకి వెళ్లారు. విద్యార్థి దశలో తొలిసారి ఎదుర్కొనే పబ్లిక్ పరీక్షలు కావడంతో పలువురు కాస్త టెన్షన్ ఫీలయ్యారు. పలువురు విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లే ముందు వరకూ కూడా పుస్తకాలతో కుస్తీ పట్టడం కనిపించింది. పరీక్షలు బాగా రాయాలంటూ పరస్పర్ విషెస్ చెప్పుకొన్నారు. పలువురు విద్యార్థులు పరీక్షలకు వెళ్లే ముందు తమ ఇష్టదైవాల ఆలయాల్లో పూజలు చేశారు.

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరిగింది. తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షను 19,046 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 104 మంది గైర్హాజయ్యారు. 18,906 మంది రెగ్యులర్, 36 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 99 శాతం మంది హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) డాక్టర్ సలీం బాషా తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. చాలాచోట్ల కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యార్థులను తమ పాఠశాల వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాయి. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు.. విద్యార్థుల వెంట ఉండి చివరి నిమిషం వరకూ తగు సూచనలిస్తూ కనిపించారు. పరీక్ష విధులకు హాజరైన చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీఓ), ఇన్విజిలేటర్లను సెల్‌ఫోన్లతో పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్ష ప్రారంభం కాగానే తల్లిదండ్రులను, ఇతరులను పోలీసులు ఆయా కేంద్రాలకు దూరంగా పంపించేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

ఆకస్మిక తనిఖీలు

పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, ఇన్‌ఫ్రా జేడీ, పదో తరగతి పరీక్షల జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం, డీఈఓ డాక్టర్ బాషా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతో పాటు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీ చేశాయి. వీరు మొత్తం 51 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.



రాయవరంలో రూమ్ నంబర్లను నోటీసు బోర్డులో చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్షకు వెళ్లే ముందు చివరి నిమిషంలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయిని

ప్రశాంతంగా నిర్వహించాలి

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్వహణాధికారులను జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదేశించారు. అమలాపురం పట్టణంలోని కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తరగతి గదుల్లోకి స్వయంగా వెళ్లి నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయుడు, సీఎస్ కె.ఘన సత్యనారాయణకు, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు ఇచ్చారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు. చిత్రంలో ఏఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, బందోబస్తుపై ఆయన చర్చించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా బందోబస్తు ఉండాలని సూచించారు. జిల్లాలో క్రైమ్ రేటు తగ్గింపు, నేర పరిశోధనలో అధునాతన సాంకేతిక సహకారంతో మరింత ముందుకు వెళ్లడంపై జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ చర్చించారు. మహిళల భద్రత కోసం నిర్వహిస్తున్న శక్తి యాప్‌పై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. చోరీలు, రికవరీలు, అరెస్టులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, రఘువీర్, సుంకర మురళీమోహన్, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్, జిల్లా ఐటీ కోర్, క్రైమ్ విభాగాల సిబ్బంది, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. వీరు పోలీస్ సబ్ డివిజన్లు, సర్కిళ్లు, స్టేషన్ల వారీగా క్రైమ్ నివేదికను ఎస్పీకి వివరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

బాలిక అదృశ్యం

గోపాలపురం: ఇంట్లో నిద్రపోయిన బాలిక మరుసటి రోజు ఉదయం నుంచి కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, గోపాలపురం మండలం భీమోలు పంచాయతీలోని తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్‌బాబు, గంగ దంపతులు శనివారం రాత్రి పది గంటలకు కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి వారి కుమార్తె(17) కనిపించలేదు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

గురుతర బాధ్యతగా..

- సామాజిక సేవలో తరిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రసాదరావు
- సేవా కార్యక్రమాలకు ఏటా ఓ నెల జీతం కేటాయింపు
- మూడున్నర దశాబ్దాలుగా ఇదే బాట

ఉపాధ్యాయుడు.. అంటే జీవితానికి దిక్సూచి. ఓ మార్గదర్శి. గమ్యమేంటో తెలియని బాల్యానికి లక్ష్యాన్ని నిర్దేశించే గురువు. ఇంతటి గురుతర బాధ్యతను మోస్తున్న ఉపాధ్యాయుడు.. ఆదర్శాలను పాటించాలని బోధించడమే కాదు.. తానూ ఆచరించి సమాజానికి 'గుణ'పాఠాలు నేర్పడం గర్వించదగిన విషయం. అలాంటి ఉన్నత విలువలు కలిగిన ఉపాధ్యాయులూ ఎక్కడో అరకొర దర్శనమిస్తుంటారు ఇవ్వల ప్రసాదరావు, దాడి కొండబాబు లాంటివారు.

కరప: ఏదో రకంగా ఆస్తులు కూడబెట్టుకోవాలనుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. కష్టార్జితంలో ఏటా ఓ నెల జీతాన్ని సామాజిక సేవకు వినియోగిస్తూ ఆదర్శప్రాయంగా నిలిచారు కరప మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు(సాంఘిక శాస్త్రం) ఇవ్వల ప్రసాదరావు. అలాగని ఆర్థికంగా ధనవంతుడేమీ కాదు. వారసత్వంగా ఆస్తిపాస్తులూ లేవు. కేవలం నెలవారీ జీతంతో కుటుంబాన్ని పోషిస్తూనే, సేవా కార్యక్రమాలకు సొంత ధనాన్ని వెచ్చించడం విశేషం. ఉన్నంతలో పేదలకు సాయం అందించాలన్న దృక్పథం ఒకవైపు, మహాత్మా గాంధీ, మదర్ థెరిసా, స్వామి వివేకానందుడు వంటి మహోన్నతుల ప్రేరణతో సామాజిక సేవ చేస్తున్నట్టు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతైన ప్రసాదరావు తెలిపారు. తన సేవా కార్యక్రమాలను ప్రసాదరావు తెలిపారు.

కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన ఇవ్వల ప్రసాదరావు ఎంఏ, బీఈడీ చదివారు. 1989లో ఉపాధ్యాయుడిగా కాజులూరు మండలం రేగుబాడవలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జాతీయ నాయకుల ప్రేరణతో ఉద్యోగంలో చేరిన రోజే ప్రతి ఏటా ఓ నెల జీతాన్ని సామాజిక సేవకు వినియోగించాలని దృఢ నిర్ణయం తీసుకున్నారు. తొలుత రూ.398 జీతంతో ఉద్యోగంలో చేరారు. అదే ఏడాది నుంచి రూ.398తో సామాజిక సేవ ప్రారంభించిన ప్రసాదరావు ప్రస్తుతం సేవా కార్యక్రమాలకు రూ.లక్ష వరకూ ఖర్చు చేస్తున్నారు.



ఇవ్వల ప్రసాదరావు, ఉపాధ్యాయుడు

మహాత్ముని ఆశయాల కోసం..

భవిష్యత్తు తరాలు బాగుండాలంటే గాంధీ మహాత్ముని ఆశయాలు సత్యం, ధర్మం, అహింస వంటి భావాలు విద్యార్థుల్లో పెంపొందించేందుకు జిల్లావ్యాప్తంగా తాను పనిచేసిన మండలాల్లోని 26 పాఠశాలల్లో గాంధీజీ విగ్రహాలను సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. వేళంగి హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని నెలకొల్పారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకినాడ చర్చిస్కేర్ వద్ద ఉన్న జూనియర్ కళాశాలల్లో గాంధీజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడులో 22 ఏళ్లు పని చేసిన ఆయన అక్కడి విద్యార్థులకు ఐడీ కార్డులు, పలకలు, పుస్తకాలు, పెన్నులు, బోధనా పరికరాలు, అభ్యసనా సామగ్రి అందజేశారు. ప్రత్తిపాడు యూపీ స్కూల్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్ది అందరి ప్రశంసలు పొందారు. 2004లో బాలికల గ్రిగ్స్ క్రీడలకు 30 రోలింగ్ షీల్డ్స్ అందించి, ఆనాటి ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేల ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2005లో అప్పటి డీఈఓ ప్రసన్నకుమార్, జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ఎంపీ వంగా గీత ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్నారు. అనేక సార్లు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ, స్మారక అవార్డులూ అందుకున్నారు.

నగదు ప్రోత్సాహకాలు

తర్వాత కాజులూరు మండలం మంజేరు హైస్కూలులో ప్రసాదరావు పదేళ్లు పనిచేయగా, ఏటా టెన్త్‌లో ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.1,116 నగదు ప్రోత్సాహకం అందించారు. కరోనా సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సుమారు 40 మండలాల్లో రూ.1.50 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు, మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. 2021 నుంచి పనిచేస్తున్న గురజనాపల్లి హైస్కూలులో ప్రతి తరగతి గదికి వాల్‌క్లాక్, వివిధ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. రూ.15 వేల విలువైన మైక్‌సెట్‌ను సమకూర్చారు. హెచ్‌ఎం గదిలో రూ.15 వేలతో జాతీయ నాయకుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఇటీవల రూ.70 వేలతో మహాత్మా గాంధీ, పూర్వ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, భారతరత్న అబ్దుల్‌కలాం విగ్రహాలను నెలకొల్పారు. పాఠశాలలో రూ.15 వేల వ్యయంతో ప్లాంటేషన్ చేయించారు. దశాబ్ద కాలంగా టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు. పలువురు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నారు. గత 36 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా, ఆ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి విశేష కృషి చేస్తున్నారు.



గురజనాపల్లి హైస్కూలు తరగతి గదిలో ఏర్పాటు చేసిన పటాలు

సంఘ పరంగా..

జిల్లాలోని ఐదు వేల మంది ఉపాధ్యాయులకు ప్రసాదరావు సర్వీసు రిజిస్టర్ల సేవలందించారు. యూటీఎఫ్‌కు రాష్ట్ర కౌన్సిలర్‌గా, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సేవలందించారు. ప్రస్తుతం కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే వివిధ సందర్భాల్లో అనాథాశ్రమంలో వృద్ధులకు సాయం చేస్తుంటారు. ఎన్ని ఒడిదుడుకులెదురైనా ఉద్యోగ విరమణ వరకూ నెల జీతం సామాజిక సేవకు కేటాయిస్తానని ప్రసాదరావు తెలిపారు.



కాకినాడలోని ఓ ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న ప్రసాదరావు (ఫైల్)



పేదలకు నిత్యావసరాలు అందజేస్తూ.. (ఫైల్)



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు (ఫైల్)

అంధ విద్యార్థినికి వెలుగు రేఖగా..

- చదువుకు దత్తత తీసుకున్న ఉపాధ్యాయుడు
- జీవితంలో నిలదొక్కుకునే వరకూ అండగా ఉంటానని భరోసా

కోటనందూరు: తల్లిదండ్రులు కడు పేదవారు. వారి కుమార్తె పుట్టుకతోనే అంధురాలు. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న ఆ తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నారు. చీకటి అలముకున్న బాలిక జీవితంలో ఓ ఉపాధ్యాయుడు కొత్త వెలుగులు నింపాడు. ఆమె విద్యాబుద్ధులను భుజాన వేసుకుని.. జీవితంలో నిలదొక్కుకునే వరకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చి.. తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని బంగారయ్యపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొమ్మాకుల వెంకట కుసుమదేవి పుట్టుకతోనే అంధురాలు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈమె ప్రస్తుతం బిళ్లనందూరు ఎంపీయూపీ పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. కోటనందూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దాడి కొండబాబు వర్క్ అడ్జస్ట్‌మెంటులో భాగంగా ఈ ఏడాది బిళ్లనందూరు పాఠశాలకు వెళ్లారు. అక్కడ వెంకట కుసుమదేవి వైకల్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఆయన తెలుసుకున్నాడు. దీంతో ఆమె చదువు బాధ్యతను కొండబాబు తన భుజాన వేసుకున్నారు. ఉన్నత చదువు పూర్తి చేసి, ఉద్యోగం సాధించే వరకూ ఆర్థికంగా అండగా ఉంటానని సంకల్పించారు. ఇందులో భాగంగా బ్రెయిలీ లిపి నేర్చుకోడానికి అవసరమైన బ్రెయిలీ స్లేట్, స్టైలస్ తదితర మెటీరియల్ కొనిచ్చి, నేర్పిస్తున్నారు. బ్రెయిలీ నిపుణుల సహకారంతో కుసుమకు ప్రత్యేకంగా విద్యా బోధన చేస్తున్నట్టు కొండబాబు మాస్టారు వివరించారు. ఆ బాలికను ఉన్నత స్థితికి చేర్చేందుకు అవసరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తున్నట్టు చెప్పారు. ఆ విద్యార్థినికి అండగా ఉంటూ, పలువురికి ఆదర్శంగా నిలిచిన కొండబాబు మాస్టారుని ఎంఈఓలు ఏవీఎస్ శ్రీనివాస్, ఎంవీ రామశేఖర్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.



వెంకట కుసుమదేవికి బ్రెయిలీ స్లేట్ అందిస్తున్న కొండబాబు మాస్టారు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తుని: రేగుపాలెం-ఎలమంచిలి స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడిన సంఘటనలో సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయనకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు తెలుపు, నీలం, నలుపు గడుల పొట్టి చేతుల చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి, మాసిన గెడ్డంతో ఉన్నాడు. మెడలో తాయెత్తులు ఉన్నాయి. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు తుని జీఆర్పీ పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో మృతదేహం

ఉప్పలగుప్తం: అమలాపురం చల్లపల్లి ప్రధాన పంట కాలువలో సరిపల్లి గ్రామ పరిధిలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైందని ఎస్సై సీహెచ్ రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు, మృతదేహాన్ని వెలికితీశామని చెప్పారు. మృతునికి 50– 55 ఏళ్ల వయస్సు ఉంటుందని చెప్పారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ పరిధిలోని కడలి చెరువులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లకు పైగా ఉండవచ్చు. ఈ మేరకు స్థానికులు నగరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సమీప పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను ఆరా తీస్తున్నారు.

ఉయ్యాల తాడే.. ఆమెకు ఉరితాడు

- మద్యానికి బానిసైన భర్త నిర్వాకంతో వివాహిత బలవన్మరణం
- తల్లిని కోల్పోయిన చిన్నారులు

కాకినాడ క్రైం: అల్లారుముద్దుగా చూసుకుంటున్న తన బిడ్డను నిద్రపుచ్చేందుకు కట్టిన ఉయ్యాల తాడుతోనే.. ఆ తల్లి ఉరి వేసుకుని శాశ్వత నిద్రలోకి జారుకుంది. మద్యానికి బానిసైన భర్త వైఖరి.. అభంశుభం తెలియని ఇద్దరు బిడ్డల భవిష్యత్తు ఏమైపోతుందోననే ఆందోళన.. జీవితాన్ని ఎదురొడ్డలేనేమోనన్న నిస్సహాయత వెరసి.. ఎన్నో కలలుగన్న ఆ వివాహిత తన నూరేళ్ల జీవితాన్ని అర్ధంతరంగా ముగించి తనువు చాలించింది. ఎన్నో కలలు చూపించి, ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్తకు మద్యం ముందు భార్యాబిడ్డలు ఆనకపోవడంతో.. తమ మరణంతోనైనా భర్తకు కనువిప్పు కలుగుతుందనుకుంటూ తనకు తాను మరణ దండన విధించుకుంది. తన ఇద్దరు బిడ్డలకు తల్లి ప్రేమను శాశ్వతంగా దూరం చేసి, జీవితాంతం గుండెకోత మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



పిల్లలతో స్వాతి (ఫైల్)

జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొట్టేడు స్వాతి(26)కి 2017లో కాకినాడకు చెందిన తలాటం సురేష్‌తో వివాహమైంది. వీరిది ప్రేమ వివాహం. కార్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న సురేష్ పెళ్లయిన తొలి నాళ్లలో భార్యతో బాగానే ఉండేవాడు. మద్యం అలవాటు శ్రుతి మించడంతో కొంతకాలం తర్వాత భార్యను పట్టించుకోవడం మానేశాడు. వీరికి నాలుగేళ్ల బాబు, ఎనిమిది నెలల పాప ఉన్నారు. నిత్యం మద్యం మత్తులో జోగుతూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అతడి వైఖరితో స్వాతి తీవ్ర అసహనంతో ఉండేది. ఎంత నచ్చజెప్పినా సురేష్‌లో మార్పు రాలేదు. స్నేహితులతో కలిసి తాగుబోతులా మారాడని తల్లిదండ్రుల వద్ద స్వాతి బాధపడుతుండేది. ఈ క్రమంలో దంపతుల మధ్య వాదులాటలు జరిగేవి. ఆదివారం అర్ధరాత్రి మద్యం తాగొచ్చిన సురేష్.. భార్యాపిల్లలు పడుకున్న గదిలో నిద్రపోయాడు. భర్త రాకను స్వాతి గమనించి, ఇంతేనా జీవితం అంటూ ప్రశ్నించింది. దీంతో సురేష్ భార్యతో గొడవ పడ్డాడు. ఇలాగే ఉంటే తమ పిల్లల సంగతేంటని ప్రశ్నించడంతో, సురేష్ తిరగబడ్డాడు. దీంతో విసుగెత్తిన స్వాతి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బలవన్మరణానికి పాల్పడింది. పిల్లల కోసం కట్టిన ఉయ్యాల తాడునే ఉరితాడుగా మార్చుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె సోదరుడు నగేష్ ఫిర్యాదుతో కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

– ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు రైతుల వినతి

సాక్షి, అమరావతి: కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు కంపెనీలు కొనుగోలు చేయడం వలన తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు, కోకో రైతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షలో కంపెనీల మాయాజాలంతో ఎలా నష్టపోతున్నారో పలువురు కోకో రైతులు వివరించారు. ఏపీ కోకో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్‌బాబు, గుదిబండి వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు రూ.700కు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550–రూ.600కు మించి చెల్లించడం లేదన్నారు. గ్రేడింగ్ పేరిట అడ్డగోలుగా ధర తగ్గించడం వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి సీజన్, అన్‌సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే, వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీంను కోకో రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ, తప్పకుండా కోకో రైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సంఘ ప్రతినిధులు డైరెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రతినిధులతో పాటు, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కోకో రైతులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల హాలులో సిమెంట్ బస్తాలు

- విద్యార్థులను నిలిపి, బస్తాల తొలగింపు
- నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షా కేంద్రంలోని ఒక గదిలో సిమెంటు బస్తాలు నిల్వ ఉంచడం.. విద్యార్థులు వచ్చిన తర్వాత వాటిని తొలగించడానికి చర్యలు చేపట్టడంపై వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలివీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్ల వంతెన వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని రూమ్ నంబర్ ఏడులో 22 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. బ్లాక్ బోర్డు, బెంచీలపై నంబర్లు కూడా రాశారు. ఇదిలా ఉండగా పలు పాఠశాలల్లో నిర్మాణ పనులకు అవసరమైన సిమెంటు బస్తాలను ఈ స్కూలును స్టాక్ పాయింట్‌గా ఉపయోగిస్తూ, ఇదే గదిలో నిల్వ ఉంచారు. సోమవారం ఉదయం నుంచి టెన్త్ పరీక్షలు మొదలవుతున్నాయని తెలిసి కూడా వీటిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పరీక్షల నిర్వహణాధికారులు అలాగే ఉంచేశారు. ముందు రోజో లేదా పరీక్షలు రాసేందుకు వచ్చేలోగానో ఆ బస్తాలను అక్కడి నుంచి తొలగించి ఉండాల్సింది. కానీ, పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఈ గదికి వచ్చేసరికి కూలీలతో సిమెంట్ బస్తాలను బయటకు తీసుకుని వస్తున్నారు. ఆ దృశ్యాలను చూసి, విద్యార్థుల తల్లిదండ్రులు అసహనానికి గురయ్యారు. పరీక్షల నిర్వహణపై ఇంత నిర్లక్ష్యమేమిటని ఆగ్రహించారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను తరగతి గది బయట నిలబెట్టి, సిమెంట్ బస్తాలు బయటకు తీసుకురావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్ బాషా వెంటనే ఈ పాఠశాలను సందర్శించారు. సిమెంట్ బస్తాలు పాడవకూడదనే ఉద్దేశంతోనే వాటిని ప్రధానోపాధ్యాయుడు తరగతి గదిలో ఓ మూల భద్రపరిచారని చెప్పారు. పరీక్ష ప్రారంభం కాకముందే సిమెంట్ బస్తాల తొలగింపు చేపట్టారని తెలిపారు.



సిమెంట్ బస్తాలు తొలగిస్తున్న కూలీలు

అన్నా హజారే దృష్టికి పర్యావరణ విధ్వంసం



అన్నా హజారేకు వినతిపత్రం ఇస్తున్న ధర్మారావు

తాళ్లరేవు: రాష్ట్రంలోని విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు జరుగుతున్న తీవ్ర పర్యావరణ విధ్వంసాన్ని పరిష్కరించడంలో మార్గదర్శకత్వాలు ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త అన్నా హజారేకు వైల్డ్‌కానోపి హేబిటాట్స్ ఓషన్స్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సంగాడి ధర్మారావు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలు, ముఖ్యంగా చమురు శుద్ధి, రసాయన కర్మాగారాలు చట్టాలను ఉల్లంఘిస్తున్నట్లు పేర్కొన్నారు. నియంత్రణలేని కాలుష్యం సముద్ర జలాలను కలుషితం చేయడం ద్వారా జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తూ, వేలాది తీరప్రాంత వర్గాల జీవనోపాధికి ప్రమాదం కలిగిస్తున్నాయని తెలిపారు. కాలుష్యం కారణంగా కోరింగ వన్యప్రాణుల అభయారణ్యం, కోస్టల్ రెగ్యులేటరీ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్‌లో మడ అడవులను క్రమపద్ధతిలో నాశనం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో సంచరించే ఆలివ్ రిడ్లే తాబేళ్ల సామూహిక మరణాలు, వలస పక్షుల క్షీణత, అరుదైన వృక్ష, జంతుజాలాలు అంతరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. దీని పరిష్కారానికి కృషి చేయాలని అన్నాహజారేను కోరినట్టు ధర్మారావు విలేకర్లకు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు: రామచంద్రపురం మండలం నేలపర్తిపాడు గ్రామానికి చెందిన వల్లూరి సురేష్‌బాబు(50) రైలు ఢీకొన్న ఘటనలో మృతి చెందినట్టు సామర్లకోట రైల్వే ఎస్సై పి.వాసు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు, ఆదివారం రాత్రి బిక్కవోలు-పెదబ్రహ్మదేవం గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ దాటుతున్న అతడిని గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో మృతి చెందాడన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై.. భగ్గుమన్న మాల మహానాడు

- అమలాపురంలో టీడీపీ కార్యాలయం ముట్టడి
- సీఎం, డిప్యూటీ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణను, తప్పుల తడకలా ఉన్న రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ ఆమోదించడంపై జిల్లా మాల మహానాడు అమలాపురంలో సోమవారం రాత్రి భగ్గుమంది. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సీఎం చంద్రబాబు డౌన్ డౌన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తమతో ఫోన్‌లో మాట్లాడితే కానీ ముట్టడి విరమించబోమని భీష్మించి కూర్చున్నారు. రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు తదితరులు ఈ నిరసనకు నాయకత్వం వహించారు. ఎస్సీ వర్గీకరణను, రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను ఆమోదించిన కేబినెట్ తక్షణమే దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మాలలపై కక్ష కట్టిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాలలపై వ్యతిరేక ధోరణిలో ఉన్నారని ఆరోపించారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను రద్దు చేసి, హైకోర్టు జడ్జీలతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి, న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమరావతిలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఫోన్‌లో మాట్లాడాలని ఆందోళనకారులు పట్టుబట్టారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేతబూని ప్రదర్శన నిర్వహించారు. గంటకు పైగా టీడీపీ కార్యాలయ ముట్టడి కొనసాగుతుండగా, అమలాపురం పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్ ఆందోళనకారులతో చర్చించారు. ఎమ్మెల్యే అమరావతిలో బిజీగా ఉండడం వల్ల ఫోన్ మాట్లాడలేకపోతున్నారని సీఐలు వారికి నచ్చజెప్పేందుకు యత్నించారు. ఎమ్మెల్యే అమలాపురం వచ్చాక ఆయా డిమాండ్లపై మాట్లాడాలని సూచించారు. చివరకు ఆందోళనకారులు ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రాన్ని అందించి ఆందోళనను విరమించారు. మాల మహానాడు నేతలు పెయ్యల పరశురాముడు, కుంచే బాబులు, గిడ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించిన మాల మహానాడు నాయకులు